# కవుల కష్టాలు



*అనవేమ మహీపాల*
*స్వస్త్యస్తు తవ బాహవే*
*ఆహవే రిపు దోర్దండ*
*చంద్ర మండల రాహవే*

**భావం:** అనవేమ మహారాజా, యుద్ధంలో శత్రు బాహువులనే చంద్రుడికి రాహువు వంటిదైన నీ బాహువునకుస్వస్తి.

ప్రజలలో సాహిత్యాభిలాష తగ్గిపోతున్నదనీ, ఒక గ్రంథం వెయ్యి ప్రతులు వేసినా కొనేవారు లేరనీ నేటి రచయితలలో అసంతృప్తి ఉంది.

పూర్వకాలంలో మహారాజులు అక్షరలక్షలిచ్చేవారనీ, కృతికావాలంటే నిరుపహతి స్థలం. ఉయ్యాల మంచం వంటివన్నీ ఇస్తే కాని రాయననే ధైర్యం కవులకుండేదనీ నేడు అనుకుంటారు.

ఆనాటి పరిస్థితి నిజంగా అలా ఉండేదా? రాజాస్థానంలో ప్రవేశమే కష్టంగా ఉండేది. ఆ తరువాత మహారాజుగారికి కవిత వినిపించాలి. ఆ కవిత రాజుగారికి నచ్చాలి. నచ్చినంతలో అక్షర లక్షలు ఇచ్చేసేవారా?

ఒక కవి ప్రయాణ సాధనాలూ, మార్గమధ్యంలో బసకి సౌకర్యాలూ లేని రోజుల్లో కష్టపడి అనవేమా రెడ్డిని కల్సుకుందుకు బయల్దేరాడు. ఎంతో ప్రయాసతో రాజధాని చేరుకున్నాడు. ఇంకెంతో కష్టపడి రాజుని దర్శించుకున్నాడు. సభామధ్యంలో కవిత చదివే అవకాశం దొరికింది. అందరూ మహారాజు సౌందర్యాన్నీ రసికతనూ ప్రశంసిస్తూ పద్యాలు చెప్తున్నారు. తాను వీరత్వాన్ని మెచ్చుకుంటే కొంత తేడాగా ఉండడంవల్ల రాజు గారి దయ ప్రాప్తిస్తుందని కవిగారు "అనవేమ మహారాజా... యుద్ధంలో శత్రు బాహువులనే చంద్రుడికి రాహువు వంటి నీ బాహువునకు స్వస్తి" అన్నాడు.

మహారాజుకి పద్యం నచ్చింది. కోశాధికారితో కవికి వెయ్యి దీనారాలిప్పించమన్నాడు. కవి "మహారాజా తమ దర్శనానికి వెయ్యి దీనారాలు ఖర్చుపెట్టుకు వచ్చాను." అన్నాడు. మహారాజు రెండువేల దీనారాలిమ్మన్నాడు. " రాజా ఒక వెయ్యి రావడానికి ఒక వెయ్యి పోవడానికి నాకు మిగిలిందేమిటి? అన్నాడు. వెంటనే మహారాజు మూడువేలిమ్మన్నాడు. "మహారాజా నేను మీకు నాలుగువేలు ఇచ్చాను. మీరు నాకు మూడు వేలే ఇస్తారా?" అన్నాడు. మహారాజు ఆశ్చర్యంగా "నాకు నాలుగువేలు ఎప్పుడిచ్చారు"? అన్నాడు. " మహారాజా.. పద్యం వినండి, గమనించండి, ఒక్కో పాదంలో ఒక్కో వే అన్న అక్షరం ఉంది. మొత్తం నాలుగు వేలు" అన్నాడు కవి.

మహారాజు చిన్నగా నవ్వి "సరే నువ్విచ్చిన నాలుగువేలు, దారి ఖర్చులు రెండువేలు మొత్తం ఆరువేలు పట్టుకెళ్ళండి" అన్నాడు. కవి

"మహారాజా ఆరువేల నాటి సీమ నుంచి వచ్చాను ఆరువేలేనా" అన్నాడు. సరే ఏడడుగుల బంధం లాగానే ఏడు వేలిస్తాను" అన్నాడు. కవి సంతుష్టి చెందాడు.

ధనానికై కవులు ఎంత కష్టపడాల్సి వచ్చేదీ తెలుస్తున్నది కదా. గ్రీకు ప్రఖ్యాత కవి హోమరు భిక్షాటనతో జీవించాడట. కావ్య రచన ప్రయోజనాలలో ధనమూ యశస్సూ వంటివి చెప్పినా అన్నిటికన్నా ముఖ్యమైనది కాంతా సమ్మితమైన ఉపదేశమేఅని నమ్మితే నాటి కవులకైనా నేటి రచయితలకైనా అసంతృప్తి ఉండదేమో. సత్కవుల్ హాలికులైనలేమి అన్న పోతన 'రాజు గారూ నిధి చాలా సుఖమా?' అని ప్రశ్నించిన త్యాగరాజు గారూ నడిచిన దారి అనుసరణీయం కాదా.

చివరగా చిన్నమాట. అనవేమారెడ్డి బాహువు రిపుదోర్దండ చంద్రమండల రాహువు కాదు. ఆయన యుద్ధాలలో ఓడిపోయిన మాట వాస్తవం. మానినీ మన్మథుడని మహాకవులు పొగిడిన కృష్ణరాయలకు స్ఫోటకం మచ్చలుండేవట. ధనానికై కీర్తికై అబద్ధపు పొగడ్తలకి కవులుసిద్ధపడడం అంత మంచిది కాదేమో.

******